# సంపాదకీయం

*మన ప్రభువైన యషువా మెస్సీయ నామములో "రాజ్య సువార్త" పాఠకులందరికీ వందనములు.*

"రాజ్య సువార్త" పునఃప్రారంభాన్ని చాలామంది పాఠకులు అభినందించారు, సంతోషించారు. ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. కొంతమంది కొన్ని విషయాలలో విభేధించినా చాలా విషయాలలో ఏకీభవించి ప్రోత్సాహాన్నిస్తున్నారు. వారందరికీ నా కృతజ్ఞతలు.

రక్షించబడడానికి ఇన్నిన్ని లోతైన విషయాలు ఇన్నిన్ని లెక్కలు అవసరమా అని మనసులో మాటను చెప్పినవారున్నారు. ఆయన రక్తంలో కడుగబడి మారుమనస్సు పొంది పాపక్షమాపణ పొందితే పరలోక రాజ్యానికి వెళ్తాము. చాలా సింపుల్. దానికోసం ఈ బోధంతా ఎందుకు ? దండగ అని వారంటున్నారు. రక్షించబడటానికి ఆయన శిలువ రక్తంలో మన పాపాన్ని కడుగుకొని శుద్ధి చేసుకుంటే తప్పక మనం పరలోకాన్ని చేరుకుంటాము. అది ముమ్మాటికీ నిజం. చిన్న పిల్లలకు పాలు మాత్రమే ఇస్తారు. వారు జీవించడానికి, ఎదగడానికి ఆ పాలు మాత్రమే సరిపోతాయి. కొంచెం పెద్దయ్యాక తేలికపాటి అన్నం ముట్టిస్తారు. వారు ఎదిగే కొలది ఇంకా బలవర్ధకమైన ఆహారం ఇస్తారు. అది సంతులిత ఆహారం అయితేనే వారు ఆరోగ్యంగా ఉంటారు. ఏ ఒక్కటి తక్కువైనా న్యూనతా వ్యాధులు వస్తాయి. ఇబ్బంది పెడతాయి. ఇవన్నీ కావాలా ? అనేవారు పిల్లలు పెరిగి యౌవనస్తులు అయిన తర్వాత కూడా వారికి పాల సీసాలో పాలుపోసి పాల పీకపెట్టి నోటిలో పట్టిచ్చే రకం. అందుకే హెబ్రీ పత్రిక రచయిత అంటాడు– "ఇందును గూర్చి (ఇతని గూర్చి – యషువా మెస్సియను గూర్చి) మేము చెప్పవలసినవి అనేక సంగతులున్నవి. గాని మీరు వినుటకు మందులైనందున వాటిని విశదపరచుట కష్టము. కాలమును బట్టి చూచితే మీరు బోధకులుగా ఉండవలసినవారై యుండగా దేవోక్తులలో మొదటి మూల పాఠములను ఒకడు మీకు మరలా బోధింపవలసి వచ్చెను. మీరు పాలు త్రాగ వలసినవారే గాని బలమైన ఆహారము తినగలవారు కారు. మరియు పాలు త్రాగు ప్రతివాడును శిశువే గనుక నీతి వాక్య విషయములలో అనుభవము లేనివాడై యున్నాడు. వయస్సు వచ్చిన వారు (పరిపూర్ణులు) అభ్యాసము చేత మేలు కీడులను వివేచించుటకు సాధకము చేయబడిన జ్ఞానేంద్రియ ములు కలిగి యున్నారు. గనుక బలమైన ఆహారము వారికే తగును (హెబ్రీ 5:11-14)

"కాబట్టి నిర్జీవ క్రియలు విడిచి మారుమనస్సు పొందుట, దేవునియందలి విశ్వాసము, బాప్తిస్మములను గూర్చిన బోధ అను పునాది మరలా వేయక, క్రీస్తును గూర్చిన మూలోపదేశము మాని సంపూర్ణులమగుటకు సాగిపోవుదము". (హెబ్రీ 6:1-2) ఇవన్నీ ఎందుకు అనేవారు కిడ్స్. జ్ఞానేంద్రియాలు లేనివారు. మేలు కీడులను వివేచింపశక్తిలేనివారు, అనుభవంలేనివారు. బల వర్ధకమైన ఆహారం తినలేనివారు. ఒకవేళ తింటే అజీర్తి, పులితేన్పులు, గ్యాస్‌తో అల్లాడిపోయేవారు. ఇలాంటివారి మూలంగానే క్రీస్తును గూర్చి ఇంకా ఎన్నో విషయాలు చెప్పాలని ఉన్నా గాని, వారు వాటిని వినే స్థితిలో లేనందున హెబ్రీ పత్రిక కర్త వాటిని వ్రాయలేదు. తద్వారా ఎన్నో విషయాలు మనకు ఇలాంటి వారివలన తెలియకుండా పోయాయి.

**క్రీస్తును గూర్చిన మూలోపదేశం :** మారుమనస్సు, రక్షణ, బాప్తిస్మము, తీర్పు మొదలైనవి. మారుమనస్సు పొంది రక్షించబడి, బాప్తిస్మము పొందినవారు ఇంకా ఆ మూలోపదేశాన్ని పట్టుకొని వ్రేలాడకుండా, సంపూర్ణ సిద్ధి పొందాలనే ఉద్దేశ్యంతోనే ఈ "రాజ్య సువార్తలో" లోతైన విషయాలను తెలియచెప్పడం జరుగుతుంది. ఆ స్టేజ్ మనము ఎప్పుడో దాటేశాం. ఇప్పుడు మనం రాబోయే దేవుని రాజ్యంలో మనపాత్ర ఏమిటనే దానిమీద శ్రద్ధపెట్టాలి. ఇవన్నీ ఎందుకు అనుకుంటే ఆ 1వ సూత్రాన్ని పట్టుకొని వ్రేలాడుతున్నట్లే. మీరు కూడా సంపూర్ణ సిద్ధి పొందడానికి ప్రయత్నించాలని ఆశిస్తూ...